సాక్షి మెదక్
మంగళవారం ¦ 14 ¦ మే ¦ 2024

ఓటెత్తారు



మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

మెదక్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ శాతం ఇలా..



గంట గంటకు పెరిగిన పోలింగ్

- ఉత్సాహంగా తరలివచ్చిన ఓటర్లు
- సాయంత్రం 5 గంటల వరకు 71.33 శాతం నమోదు
- 6 గంటల తర్వాత క్యూలైన్‌లో ఉన్న వారికి అవకాశం

మెదక్‌జోన్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 5 గంటలకే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన సిబ్బంది 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించారు. ఓటర్లు ఉత్సాహంతో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంట గంటకు ఓటింగ్ శాతం పెరిగింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్నవారందరు ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. దీంతో రాత్రి 7 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ సాగింది. జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ సతీసమేతంగా హవేళి ఘనాపూర్ మండలం ఔరంగాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ బాలస్వామి మెదక్ బాయ్స్ కళాశాలతో పాటు చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కాగా 2019లో మెదక్ పార్లమెంట్ పరిధిలో 71.77 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 73.63 శాతం నమోదు అయింది. అయితే మొత్తంగా ఎంతశాతం అన్నది అధికారులు ధృవీకరించాల్సి ఉంది.

చెదురు మదురు ఘటనలు

ఎన్నికల నేపథ్యంలో అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. నర్సాపూర్ మండలం బ్రహ్మణపల్లిలోని 164 పోలింగ్‌స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన మంగళి గణేష్ ఓటు వేసి అధికారుల కళ్లు గప్పి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పలు వాట్సాప్ గ్రూపుల్లో వీడియో షేర్ చేశాడు. దీంతో పోలీసులు ఆ యువకుడిపై కేసు నమోదు చేశారు. అలాగే శివ్వంపేట మండలం మల్లుపల్లి గిరిజన తండాలో ప్రత్యేకంగా పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, అప్పటివరకు ఓటు వేయమని తండా వాసులు తేల్చిచెప్పారు. రెండు కిలోమీటర్ల దూరంలో గల మల్లుపల్లికి వచ్చి ఓటు వేయాల్సి వస్తుందని వాపోయారు. విషయం తెలుసుకున్న అధికారులు ఈసారి ప్రత్యేక బూత్ ఏర్పాటు చేయడం కుదరదని, వచ్చే ఎన్నికల్లో ఏర్పాటుచేస్తామని నచ్చచెప్పడంతో శాంతించి ఓటు వేశారు. మెదక్ పట్టణంలోని పిట్లంబేస్ పరిధిలో గల 581, 161 పోలింగ్ కేంద్రాల సమీపంలో బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారని, పలువురిని పట్టణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కొంత సేపటి తర్వాత సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. పట్టణానికి చెందిన మరో బీఆర్‌ఎస్ కార్యకర్త ఓ పోలింగ్ బూత్ దగ్గర కండువా కప్పుకుని ప్రచారం చేస్తున్నాడనే ఫిర్యాదు అందుకున్న పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

ఓటేసిన ప్రముఖులు

ప్రముఖులు వారి వారి స్వగ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామమైన చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లిలో సతీసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కౌడిపల్లి మండల కేంద్రంలో, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి శివ్వంపేట మండలం గోమారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మ రామాయంపేట మండలం కోనాపూర్‌లో ఓటు వేశారు. మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ దంపతులు పట్టణంలోని పెద్దబజార్‌లో గల ప్రాథమికోన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు



మెదక్‌లో దివ్యాంగులను వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఎండ నుంచి ఉపశమనం కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. దివ్యాంగులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 7 పోలింగ్ కేంద్రాలు, నూతన ఓటర్లకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున 7 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేశారు. అలాగే పార్లమెంట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు.

మొరాయించిన ఈవీఎంలు

జిల్లాలోని పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. శివ్వంపేట మండలం 260 పోలింగ్‌స్టేషన్‌లో ఉదయం అరగంట పాటు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. టెక్నిషియన్స్ మరమ్మతులు చేసిన తర్వాత పోలింగ్ కొనసాగింది. అలాగే నర్సాపూర్‌లోని రెండు పోలింగ్ కేంద్రాల్లో అరగంట పాటు, చేగుంట మండలం కర్నాల్‌పల్లిలోని పోలింగ్ కేంద్రం, నార్సింగి మండల కేంద్రంతో పాటు నార్సింగి మండలం వల్లూరులో అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి.



బొప్పాపూర్‌లో సతీమణి మంజులాదేవితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



చిట్కుల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ దంపతులు



తెల్లాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



హవేళీఘనాపూర్ మండలం ఔరంగాబాద్‌లో ఓటు వేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో ఓటు వేసిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ దంపతులు



రామాయంపేట: కోనాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే పద్మ



శివ్వంపేట: గోమారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

న్యూస్‌రీల్

అంతా సజావుగానే: ఎస్పీ



వెల్దుర్తి పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ బాలస్వామి

వెల్దుర్తి(తూప్రాన్): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని ఎస్పీ బాలస్వామి తెలిపారు. సోమవారం వెల్దుర్తిలో పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పోలింగ్ సరళిపై ఎస్సై నవతగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సుమారు 1600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర పారా మిలిటరీ బలగాలను మోహరించామన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని వివరించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు



రామోజీపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి హరికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, డీఎస్‌ఓ బ్రహ్మంరావు, జిల్లా సహకార అధికారి కరుణ తెలిపారు. సోమవారం మండలంలోని రామోజీపల్లి, వీరోజిపల్లి, కొత్తపేట, పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. అనంతరం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన రైతు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. అకాల వర్షాలకు రైతు లు ఆందోళన చెందవద్దని, చివరి గింజ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. వారితో పాటు పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ



వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం జిల్లాలో జరిగిన పోలింగ్ పరిశీలనకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సక్రమంగా, సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు, ప్రజలకు, భాగస్వాములైన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమాచారం ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను అభినందించారు.

రైతన్నకు అకాల కష్టం



కంచన్‌పల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

కౌడిపల్లి(నర్సాపూర్): అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేస్తోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో మండలంలోని వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు, బస్తాలు తడిసి ముద్దయ్యాయి. పంటపొలాల్లో ఉన్న ధాన్యం కుప్పల చుట్టూ వర్షం నీరు చేరింది. దీంతో రైతులు పాదులు తీసి నీటిని తొలగించారు. తడిసిన ధాన్యం బస్తాలను రైతులు ఆరబెట్టారు. ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

బొల్లారంలో ఉద్రిక్తత

- బొల్లారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం
- బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు పంచుతున్నారని కాంగ్రెస్ నేతల ధర్నా



పోలీసులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. బీసీ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు డబ్బుతో పాటు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయటాన్ని కౌన్సిలర్ గోపాలమ్మ, రాములు అడ్డుకున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అలాగే బొల్లారం న్యూబస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు పంచుతుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. డబ్బులు పంచుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని చంద్రారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పోలీసులకు సూచించారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. దీంతో సీఐ గంగాధర్ కల్పించుకొని చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి ఆరోపించారు.

ఓటింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న నీలం మధు, నాయకులు

నర్సాపూర్: పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ తీరును అభ్యర్థులు తమ పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అధికారులతో మాట్లాడి పోలింగ్ శాతం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే బయట ఓటు వేసేందుకు నిరీక్షిస్తున్న ఓటర్లను కలిసి తనను పరిచయం చేసుకున్నారు. పట్టణంలోని రెండు బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయని నాయకులు చెప్పగా అధికారులతో మాట్లాడారు. అలాగే బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సైతం నాయకులతో కలిసి పోలింగ్ శాతం తెలుసుకున్నారు. ఎన్నికల అధికారులతో మాట్లాడి ఈవీఎంలు త్వరగా మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, రాజేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నర్సాపూర్‌లోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద తమ పార్టీ నాయకులతో పోలింగ్ సరళిపై చర్చించారు. పోలింగ్ సరళిని, పట్టణంలో పార్టీ పరిస్థితులను ఆయనకు నాయకులు వివరించారు. అయితే పోలింగ్ కేంద్రాల్లోకి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల వెంట ఎక్కువ సంఖ్యలో రాజకీయ నాయకులు వెళ్లిన విషయాన్ని స్థానిక ఎస్‌ఐ పుష్పరాజ్ వద్ద ప్రస్తావించగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్ బూత్ లోనికి పాస్ లేని వారిని అనుమతించలే దని తెలిపారు.

12 స్థానాల్లో కాంగ్రెస్‌దే గెలుపు

మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 12 లోక్‌సభ స్థానాల్లో గెలుస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్‌లోని 196 పోలింగ్ కేంద్రంలో తన కూతురు త్రిషతో కలిసి ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని, ప్రజలు దేశంలో కూడా ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తర్వాతి స్థానం కోసం బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోటీ పడుతున్నాయన్నారు. రాష్ట్రం ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరుగ్యారంటీలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ మల్లయ్య తదితరులు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

అంతా ఓకేనా..

టేక్మాల్(మెదక్): ఎన్నికల సందర్భంగా సోమవారం టేక్మాల్‌కు వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ కార్యకర్తలతో మాట్లాడి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు మాన్‌కిషన్, సుధాకర్, కిషోర్, మజహర్, సాగర్, పాపయ్య, భిక్షపతి, కిష్టయ్య, రాజు, శివాగౌడ్, దుర్గయ్య, అంజయ్య, అనిల్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంపై సిరా మరక

ఇరువర్గాల మధ్య ఘర్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న అబ్జర్వర్ సమీర్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలోని 211, 212 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై సిరా మరక ఉండటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కారు గుర్తు ఎదురుగా ఉన్న బటన్‌పై సిరా ఇంకు అంటించి ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొద్ది సేపు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల అబ్జర్వర్ సమీర్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిరా ఇంకు చుక్కలను తొలగించి యథావిధిగా పోలింగ్‌ను కొనసాగించారు.

వెల్లివెరిసిన ఓటరు చైతన్యం

రాష్ట్రంలోనే అత్యధికంగా జహీరాబాద్ సెగ్మెంట్‌లో పోలింగ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఓటర్ల చైతన్యం వెల్లువిరిసింది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రాష్ట్రంలోనే అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కాగా, ఓటర్లు అప్పటికే కేంద్రాలకు తరలివచ్చారు. క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. మహిళలు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించినప్పటికీ.. ఈ సౌకర్యం కోసం నమోదు చేసుకోని వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేశారు. తొలిసారిగా ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు ఉత్సాహంగా ఓటేశారు. వాతావరణం కూడా అనుకూలించడం, ఎండల తీవ్రత కాస్త తగ్గడం కూడా ఓటింగ్‌శాతం పెరగడానికి కారణమైంది. జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించింది. పలు కేంద్రాల వద్ద వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఎన్నికల బందోబస్తును ఎస్పీ చెన్నూరి రూపేష్ పర్యవేక్షించారు. మొత్తం మీద జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

80 శాతానికి చేరువలో..

ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50 శాతం దాటింది. సాయంత్రం 5 గంటల వరకు 71.91 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసే వరకు సుమారు 80 శాతానికి చేరువలో పోలింగ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. పూర్తి పోలింగ్ శాతం మంగళవారం ప్రకటిస్తామని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది.

క్లుప్తంగా

సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రంలోకి..



ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌తో ఫొటో తీస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో మంగలి గణేశ్ పోలింగ్ సిబ్బందికి తెలియకుండా సెల్‌ఫోన్‌తో కేంద్రంలోకి వెళ్లి ఓటు వేస్తూ చిత్రీకరించాడు. అంతటితో ఆగకుండా తాను ఓటు వేస్తున్న దృశ్యాన్ని పలు వాట్సాప్ గ్రూపుల్లోకి ఫార్వర్డ్ చేశాడు. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడు సెల్‌ఫోన్‌తో కేంద్రలోకి వెళ్లాడని పలు పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్సై పుష్పరాజును వివరణ కోరగా.. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష మెజార్టీతో గెలుస్తా

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు



మాట్లాడుతున్న నీలం మధు

నర్సాపూర్: మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తానని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజాపక్షం ఉన్న కాంగ్రెస్‌కు ప్రజల దీవెనలు నిండుగా ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ పోలింగ్ కోసం మంచి ఏర్పాట్లు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు మల్లేశ్, చిన్న ఆంజిగౌడ్, శ్రీనివాస్‌గుప్తా, రవీందర్‌రెడ్డి, సాగర్, రాధాకిషన్‌గౌడ్, నగేశ్, శ్రీశైలం యాదవ్ తదితరులు ఉన్నారు.

ఓటేసిన దత్తత పుత్రికలు



సిరా గుర్తు చూపుతున్న రాధ, రాధిక

సిద్దిపేటజోన్: మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వెంకట్రామిరెడ్డి జిల్లా కలెక్టర్ ఉన్నప్పుడు రాధ, రాధిక అనే ఇద్దరూ అనాథ బాలికలను చేరదీసి దత్తత తీసుకొని బాలసదనంలో ఆవాసం కల్పించారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికలు రావడం వారిద్దరికీ ఓటుహక్కు సిద్ధించిన నేపథ్యంలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లోని 132 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటిసారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఓటు ఎంతో విలువైంది

బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

నర్సాపూర్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నర్సాపూర్‌లోని పలు పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటు హక్కుతో ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని, ప్రజలకు ఓటు ఆయుధం లాంటిదన్నారు. ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్‌ల వద్ద మంచి ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు గోపి, నయిమొద్దీన్, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మేం.. తొలిసారిగా..

ఓటు హక్కు వినియోగించుకున్న యువత

ప్రజాస్వామ్య పరిరక్షణకు మేము సైతం అంటూ యువత తొలిసారిగా ఓటు వేశారు. పద్దెనిమిదేళ్లు నిండి ఓటు హక్కు వచ్చిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు వేసి ఆనందాన్ని పొందారు. ఓటు విలువ తెలిసిందని, సరైన వారిని ఎన్నుకొని సద్వినియోగం చేసుకున్నామన్నారు. ఈ మేరకు తొలిసారి ఓటు వేసిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..



చేగుంట (తూప్రాన్) : మక్కరాజీపేటలో ఓటు హక్కును వినియోగించుకున్న నూతన ఓటర్లు

ఓటు విలువేంటో తెలిసింది



దుబ్బాక: తాను మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది. స్వయంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేశా. తన జీవితంలో ఈ రోజును మరచిపోను. అందరు ఓటు వేస్తారని అనుకుంటుంటే ఏదో అనుకునేదాన్ని కాని ఈ రోజు అర్థమైంది ఓటు విలువేంటో. అందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

–గాజుల నిఖిత, దుబ్బాక

అనుభూతికి లోనయ్యా...



నాకు 18 ఏళ్ల పూర్తి అయ్యాక మొదటిసారిగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం గర్వంగా ఉంది. ఓటు వేసే సమయంలో తెలియని అనుభూతికి లోనయ్యా. ఓటు విలువ ఎంత గొప్పదో స్వయంగా ఓటు వేసే సమయంలో తెలిసి వచ్చింది. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఉన్న గొప్ప తనాన్ని ఇంకా దేంతో పోల్చలేం.

– అంబటి వికాస్, దుబ్బాక

ఆత్రుతగా ఎదురుచూశా..



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం. నాకు ఓటు వచ్చినప్పటి నుంచి ఎప్పుడు ఓటు వేసే రోజు వస్తుందో అని ఎదురు చూశా. తీరా తెల్లారితే పోలింగ్ ఎప్పుడు ప్రారంభం అవుతుంది. ఓటు ఎప్పుడు వేస్తా అంటూ చాలా ఆతృతతో ఎదురుచూశా. మొదటిసారిగా ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలి.

–కొండ ప్రణవకృష్ణ, దుబ్బాక

అభివృద్ధి కోసం వేశాం



బెజ్జంకి(సిద్దిపేట): అభివృద్ధి పనులను చేసే వారిని ఎన్నుకునేందుకు ఓటు వేశాం. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. మంచి నాయకులను ఎన్నుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి.

– శేషం శ్రీవాత్సవ, లాలిత్య, బెజ్జంకి

ఉత్సాహంగా వేశాను



కొమురవెల్లి(సిద్దిపేట): ఈసారి నాకు ఓటు హక్కు వచ్చింది. మొదటి సారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి మాకు ఎప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురు చూసేవాన్ని ఇప్పుడు అవకాశం రావడం ఉత్సాహంగా ఉంది. 18 ఏళ్ల నిండిన యువత ఓటు నమోదు చేసుకొని వినియోగించుకోవాలి.

– పెంద్యాల వినయ్, మర్రిముచ్చాల

ఓటును వృథా చేయొద్దు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్నందున చాలా సంతోషంగా ఉంది. ప్రపంచంలో భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ద్వారా నేను కూడా భాగస్వామి అయినందుకు ఆనందంగా ఉంది. ఓటు ఎంతో విలువైనది. ఓటును వృథా చేయొద్దు.

– ఆదరాసుపల్లి సమన్విత, జగదేవ్‌పూర్

ప్రలోభాలకు లొంగకూడదు



సిద్దిపేటకమాన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట పట్టణంలోని సంఘమిత్ర కళాశాలలోని పోలింగ్ బూత్‌లో సోమవారం తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. మన ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది.

– తేజస్విని, విద్యార్థిని, సిద్దిపేట

మార్పు కోసం ముందుకు రావాలి



సిద్దిపేటఅర్బన్: నేను ఓటు హక్కు వినియోగించుకోవడం ఇదే తొలిసారి. ఓటు హక్కు ద్వారా మన భవిష్యత్‌ను మనమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. నిరుద్యోగుల ఆశలను నెరవేర్చే వారికే నా ఓటు. మార్పు కోసం ప్రజలు ఓటు వేయడానికి ముందుకు రావాలి. వంద శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనేలా చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

–శ్రీజ, మిట్టపల్లి

యువత పాత్ర కీలకం



నిజాంపేట (మెదక్): మొదటిసారి ఓటు హక్కును వినియోగించడం ప్రతీ ఒక్కరి బాధ్యత. రాజకీయాల్లో తమ ఓటుతో దేశ భవిష్యత్‌ను మార్చే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. యువత రాజకీయాల్లో ముందుండి దేశాన్ని కాపాడుకోవాలంటే అహర్నిశలు కృషి చేయాలి. మంచి నాయకుడిని ఎన్నుకోవడంలో యువత పాత్రం కీలకం.

– రచన, వెంకటాపూర్.కే

ఓటు హక్కు వినియోగించుకున్నా..



వటపల్లి(అందోల్): ఓటరు జాబితాలో నా పేరు రాగానే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? ఎప్పుడు ఓటేస్తానని ఎంతో ఎదురు చూశా. ఉదయమే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రజాస్వామ్యంలో ఎంపీని ఎన్నుకునే ప్రక్రియలో భాగమైందుకు మాటల్లో చెప్పలేని సంతోషంగా వేసింది.

–మన్యూరి కల్యాణి, బిజిలీపూర్

ఓటింగ్‌లో అందరం పాల్గొన్నాం



రాజకీయంలో మార్పు తీసుకురావాలంటే ఓటే వజ్రాయుధం. అభివృద్ధిని కాంక్షించే అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారానే సాధ్యం. ఇంట్లో అమ్మానాన్నలు ఓటేయడానికి వెళ్తుంటే నాకెప్పుడు ఓటు హక్కు వస్తుందా? నేనెప్పుడు ఓటు వేస్తానని ఎంతో ఆతృతతో ఎదురుచూశా. ఓటు వేసి గొప్ప అనుభూతిని పొందాను.

– పీ.సాయిక్రిష్ణ, జోగిపేట

ఓటు వేస్తేనే మార్పొస్తుంది



తొలిసారి పోలింగ్ కేంద్రంలోకి అడుగు పెట్టగానే ఎంతో సంతోషం వేసింది. కేంద్రంలో ఓటు వేసే ప్రక్రియ ఎలా ఉంటుందో అవగాహన వచ్చింది. ఈవీఎం మిషన్‌పై బటన్ నొక్కగానే దాని నుంచి వచ్చే శబ్దం వినగానే తెలియని అనుభూతి వచ్చింది. ఇకపై ప్రతీ ఎన్నికల్లో ఓటు వేస్తా. ప్రతీ ఒక్కరూ ఓటు వేస్తేనే మార్పు వస్తుంది.

– సింగూరి హేమలత, బిజిలీపూర్

గర్వంగా భావిస్తున్నా..



దేశ ప్రధానిని ఎన్నుకునే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం రావడాన్ని గర్వంగా భావిస్తున్నా. పోలింగ్ బూత్‌లోకి మొదటి సారి వెళ్లడం కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈవీఎంలో ఓటు ఎలా వినియోగించుకోవాలో నా తల్లిదండ్రులు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వచ్చిందని, అధికారులు ఓటర్ స్లిప్ అందజేయడంతో తెలిసింది.

– కాసాల స్వరూపరాణి, జోగిపేట

నా బాధ్యత నిర్వర్తించా..



చేర్యాల(సిద్దిపేట): ఓటు హక్కు వినియోగించుకోవడం పౌరుడిగా నా బాధ్యత. ప్రజాస్వామ్యంలో చట్ట సభలకు ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం వచ్చినందుకు గొప్పగా ఫీల్ అవుతున్నాను. మొదటిసారి ఓటును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మన భవిష్యత్ కోసం నిజాయితీగా ఓటు వేశాను.

–కీసరి పవన్‌కుమార్‌గౌడ్, ముస్త్యాల

సంతోషంగా ఉంది



మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది. పరోక్షంగా పాలనలో భాగస్వాములయ్యామన్న భావన కలిగింది. ప్రజలకు మంచి పాలనని అందించే నాయకుడికి ఓటు వేశాను. భవిష్యత్‌లో కూడా ఓటు వేస్తాను.

–శ్రీ ప్రియ, చేర్యాల

మెరుగైన పాలన అందించాలి



గజ్వేల్‌రూరల్: మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలకు మెరుగైన పాలన అందించాలి. దేశ భద్రత, దేశ శ్రేయస్సుతోపాటు ఉచిత పథకాలు కాకుండా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించి ఆర్థికాభ్యున్నతి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– పబ్బ యశశ్రీ, విద్యార్థిని, గజ్వేల్

ప్రజలకు మేలు చేయాలి



మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్నప్పుడే ప్రజలు ఆయా పార్టీలను విశ్వసిస్తారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజలపై భారం పడకుండా సంక్షేమ పథకాలు చేపట్టాలి.

– బడికెల నిఖిత, డిగ్రీ విద్యార్థిని, గజ్వేల్

స్వగ్రామానికి వచ్చాం..



నంగునూరు(సిద్దిపేట): మొట్టమొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. అందరూ ఓటు వేస్తుంటే మాకు కూడా వేయాలనే కోరిక ఉండేది. చదువుకుంటున్న మేము ఓటు వేయడం కోసం గ్రామానికి వచ్చాం. అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రత్యూష, నాగలక్ష్మి, రవళి, రాజగోపాల్‌పేట

నా ఓటు నీకు.. నీ ఓటు నాకు

కోహెడలో ఇరువురి ఓటు తారుమారు

కోహెడ(హుస్నాబాద్): నా ఓటు నువ్వేస్తే.. నీ ఓటు నేను వేస్తా అన్న చందంగా ఇరువురు ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న ఘటన హుస్నాబాద్ నియోజక వర్గం–32 మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 99 పోలింగ్ బూత్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వేల్పుల మైసవ్వ భర్త మల్లయ్య ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ వద్దకు వచ్చింది. నీ ఓటు వేసినట్లు ఉందని ఎన్నికల సిబ్బంది చెప్పడంతో ఒక్కసారిగా నివ్వెరపోయింది. తాను ఇప్పుడే వచ్చానని.. ఓటు వేయలేదని సిబ్బందితో వాగ్వాదం చేసింది. అనంతరం ఓటరు జాబితాను అధికారులు పరిశీలించారు. మరో ఇద్దరు ఓటర్లు వేల్పుల మైసవ్వ భర్త ఎల్లయ్య, వేల్పుల మైసవ్వ భర్త బాలయ్య పేర్లు కూడా ఉన్నట్లు గుర్తించారు. సాయంత్రం వేల్పుల మైసవ్వ భర్త బాలయ్య క్రమ సంఖ్య 930 తమ ఓటును సద్వినియోగం చేసుకోవడానికి కేంద్రానికి వచ్చారు. ఓటరు చీటిని పరిశీలించిన ఎన్నికల సిబ్బంది వేల్పుల మల్లయ్య భార్య మైసవ్వ ఓటును వేల్పుల ఎల్లయ్య భార్య మైసవ్వ క్రమ సంఖ్య 873 వేసినట్లు నిర్ధారించారు. అనంతరం వేల్పుల మైసవ్వ భర్త మల్లయ్య అనే బాధితురాలు ఓటును వేల్పుల మైసవ్వ భర్త ఎల్లయ్య ఓటు క్రమ సంఖ్యలో నమోదు చేసి ఓటును వేయించారు. ఎట్టకేలకు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న బాధిత మహిళ సంతోషం వ్యక్తం చేశారు. కాగా ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం పై పలువురు ఓటర్లు మండి పడ్డారు.



సిబ్బందిని నిలదీస్తున్న వేల్పుల మైసవ్వ

వైస్ ఎంపీపీ కోళ్లఫారంపై దాడులు

- రూ.3 కోట్లు దాచినట్టు సమాచారం
- గజ్వేల్ ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీ

తొగుట(దుబ్బాక): తొగుట ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కోళ్ల ఫారాల్లో సోమవారం తెల్లవారుజామున గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కాన్గల్ శివారులో గల ఆయన కోళ్ల ఫారంలో రూ.3 కోట్ల నగదు ఓటర్లకు పంపిణీ చేసేందుకు దాచి ఉంచారని గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గజ్వేల్ ఏసీపీతోపాటు తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ లింగంతో భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు తరలివచ్చారు. రాత్రి 1.00 గంట నుంచి 3.00 గంటల వరకు రెండు గంటలు తనిఖీలు చేశారు. కోళ్ల ఫారంలో గల అతడి కార్యాలయంతోపాటు కోళ్ల ఫారాల్లోనూ తనిఖీ చేపట్టారు. రెండు గంటల పాటు తనిఖీ చేసినా నగదు దొరకలేదు. డబ్బులు ఎక్కడ దాచిపెట్టారో చెప్పాలంటూ శ్రీకాంత్‌రెడ్డి పై పోలీసులు ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. కాగా అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చింతమడక శ్రీధర్ కోళ్ల ఫారమ్‌లో ఆదివారం సాయంత్రం పోలీసులు కూల్ డ్రింక్స్ పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే మరోమారు అర్ధరాత్రి గ్రామంలోకి పోలీసులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

హల్దీవాగులో దూకి వృద్ధుడు ఆత్మహత్య

తూప్రాన్: హల్దీవాగులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన చీర్ల ఆగమయ్య(65) భార్య కొంతకాలం కిందట అనారోగ్యంతో చనిపోయింది. పెళ్లీడు వచ్చిన కూతురు వివాహం చేయలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందేవాడు. ఆదివారం ఇంట్లోంచి బయలుదేరిన ఆగమయ్య తూప్రాన్ పట్టణ సమీపంలోని నాగులపల్లి చౌరస్తా సమీపంలోని హల్దీవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం హల్దీవాగులో మృతదేహం గుర్తించి దర్యాప్తు చేపట్టగా కాళ్లకల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.



ఆగమయ్య మృతదేహం

మహిళ ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం సోన్ జిల్లా గన్‌సోర్ తాలుకా, గుటియా తోల గ్రామానికి చెందిన జైన్‌లాల్ వర్కడే మూడేళ్ల కిందట ఊర్మిళ (30) అనే మహిళను ప్రేమించి రెండవ పెళ్లి చేసుకున్నాడు. కాగా ఊర్మిళకు ఇది వరకే పెళ్లి కాగా, ముగ్గురు పిల్లలున్నారు. ఊర్మిళ, జైన్‌లాల్ వర్కడే ఇద్దరూ కలిసి ఏడాది కిందట మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి వచ్చి అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఊర్మిళకు మునపటి పిల్లలు గుర్తుకు రావడంతో ఆదివారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జైన్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడిపై కుక్క దాడి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 11 వార్డులో ఓ కుక్క బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఆరుబయట ఆడుకుంటున్న అబ్దుర్ రాఫ్ (2)పై కుక్క దాడి చేసి ముఖంపై కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించారు.

వంట చేస్తుండగా నిప్పంటుకొని గాయాలు

చికిత్స పొందుతూ మహిళ మృతి



లక్ష్మీ (ఫైల్)

ములుగు(గజ్వేల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ములుగులో చోటు చేసుకుంది. ములుగు పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. ములుగుకు చెందిన తోడేటి లక్ష్మీ(46)కుటుంబీకులతో కలసి కొంత కాలంగా ములుగులోని డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాస ముంటుంది. ఏప్రిల్ నెల 8వ తేదీన లక్ష్మి ఇంటిలో వంట పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బట్టలకు నిప్పంటుకొని గాయాల పాలైంది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ లక్ష్మి సోమవారం తుదిశ్వాస విడిచింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త కిష్టయ్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

● ఓటేసిన ఎమ్మెల్యేలు



నారాయణఖేడ్: మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, సతీమణి అనుపమరెడ్డి



పటాన్‌చెరు : జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సదాశివపేట(సంగారెడ్డి): రవీంద్ర మోడల్ ఉన్నత పాఠశాలలో పార్టీ అనుచరులతో కలిసి ఓటేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఝరాసంగం(జహీరాబాద్): కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్ రావు

సంగారెడ్డి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డిపై ఈసీ చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు.. మోదీపై లేనిపోని మాటలు చెప్పడ మే కాకుండా రైతుబంధు, రైతు బీమా పథకాలపై ఎలక్షన్ రోజు మధ్యాహ్నమే మాట్లాడడం సరికాదన్నారు. ఈసీకి రేవంత్ పై ఫిర్యాదు చేశానన్నారు. అంతకు ముందు సంగారెడ్డిలో పోలింగ్ బూత్‌లను సందర్శించి, ఆర్‌అండ్‌బీ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్‌ను సందర్శించారు.



మాట్లాడుతున్న రఘునందన్ రావు

ఊర కుక్కల దాడిలో 48 జీవాలు మృతి

వర్గల్(గజ్వేల్): ఊరకుక్కల దాడిలో 48 మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వర్గల్ మండలం అంబర్‌పేటలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. వర్గల్ మండలం అంబర్‌పేటకు చెందిన గొర్రెల పెంపకందారు బండ సత్యనారాయణకు 150 దాకా గొర్రెలు ఉన్నాయి. వాటిని గ్రామ సమీపంలోని గొర్రెల కొట్టంలోకి పంపి వంతుల వారీగా కుటుంబసభ్యులు కాపలా ఉంటారు. ఆదివారం సాయంత్రం జీవాలను కొట్టంలోకి పంపి భోజనం చేసేందుకు ఇంటికెళ్లాడు. భోజనం చేసిన తర్వాత గాలి, వాన రావడంతో సత్యనారాయణ ఇంటి వద్దే ఉండిపోయాడు. అదే రాత్రి కొట్టంపై ఊరకుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 48 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అనేక గొర్రెలు గాయాలపాలయ్యాయి. సోమవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లిన సత్యనారాయణ గొర్రెలు మృత్యువాత పడినట్లు గుర్తించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. మృతిచెందిన గొర్రెలను వర్గల్ జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్ పరిశీలించి బాధితుడిని ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు.



మృతి చెందిన గొర్రెలు